# అవిశ్వాసం

స్కానింగ్‌లో ఆడపిల్లని తేలింతర్వాత శ్వేత మహదానంద పడిపోయింది. కారణం ఇద్దరు మగపిల్లల తర్వాత... తనకు కూతురు పుట్టబోతోంది. మగపిల్లల కంటె కూడా ఉన్నతంగా కూతుర్ని తీర్చిదిద్దాలి. తనలాగే సంఘంలో ఒక గౌరవస్థానంలో నిలపడానికి ప్రయత్నించాలి.

తనేనాడూ అనుకోలేదు... డిగ్రీ పూర్తయి పెళ్లికాగానే సంసార సాగరంలో సాఫీగా వెళ్తోన్న తను... రాజకీయాల్లో మహిళల రిజర్వేషన్ల పుణ్యమాని భర్త ఒత్తిడి మీద నిల్చుండి అనుకోకుండా 'మండలాధ్యక్షురాల'యింది. ఈ రెండున్నర ఏళ్లలో ఎంతో ప్రజాభిమానం సంపాదించుకొని మండలంలో, జిల్లాలో 'శ్వేత' అంటే ఒక ప్రత్యేకస్థానాన్ని సంపాదించుకుంది.

సంసార జీవితానికి, రాజకీయ జీవితానికి వారధిలా నిలిచి ఎన్నెన్నో ఒడిదుడుకులు రాజకీయంగా, సంసార పక్షంగా ఎదుర్కొంది.

ముఖ్యంగా ఈ మధ్య భర్త రామకృష్ణకూ... తనకూ రోజుకో యుద్ధమే సాగుతోంది. పదవిలో వున్నప్పుడే బాగా సంపాదించుకోవాలన్నది అతడి అభిప్రాయం. నమ్మిన ప్రజల్ని వంచించకూడదన్నది తన మతం...

టీచర్ల పోస్టింగ్‌ల విషయంలో, బదిలీల విషయంలో మండలాధ్యక్షురాలి భర్త హోదాలో రామకృష్ణ వేల రూపాయలు తీసుకోవడం, ఆఫీసులో సిబ్బందిని రకరకాలుగా హెచ్చరించడం... ఫలానా టీచర్ పదివేలిచ్చాడు గనక ఫలానా గ్రామానికి పోస్టింగ్ ఇవ్వాలని ఇంట్లోతనతో గొడవపడటం... ఎం.డి.వో.ని బదిలీ చేసే ప్రయత్నాలు జిల్లాలో మొదలుపెట్టమని జడ్.పి.టి.సి. సభ్యుడితో చేతులు కలిపి ఇంట్లో చేయి చేసుకోవటం వరకూ... రోజూ ఒక సమరం.

ఇంట్లో అత్త, మామయ్య మరుదులు అంతా అతడికే సపోర్టు. ఈ రోజయినా సంతోషంగా గడపాలి. స్కానింగ్‌లో కూతురని తేలిందని చెప్పాలి. అతడికీ ఆడపిల్లలంటే ప్రేమ. ఈ ఆలోచనలతోనే ఆటో దిగింది శ్వేత. అత్తకీ, మామకి విషయం చెప్పి అలసటగా వుండటంతో బెడ్‌రూంలోకెళ్లి పడుకుంది.

కాసేపటికి సుజుకీ మీద రామకృష్ణ ఆఘమేఘాల మీద వచ్చాడు. అతడి ముఖంలో ఆందోళన విపరీతంగా కొట్టొచ్చినట్టు కనపడుతోంది. చేతిలో దినపత్రిక వుంది. గబగబా శ్వేత దగ్గరకూ వచ్చి ఆగిపోయాడు.

"హాస్పిటల్ కెళ్లావా? " ముభావంగానే అడిగాడు. శ్వేత మొహం విప్పారింది.

"అవునండీ...గుడ్‌న్యూస్. ఆడపిల్లని డాక్టర్ చెప్పింది" లేచి కూచుంటూ ఆనందంగా చెప్పింది శ్వేత.

"ఆడపిల్లా ? " ముఖం వికారంగా పెడుతూ అన్నాడు రామకృష్ణ.

"అదేంటండీ. ఆడపిల్ల పుట్టాలనీ ఇద్దరం కోరుకున్నాం. అదే ఫలించబోతుంది" కొంచెం అనుమానంగా చూస్తూ అంది శ్వేత.

"అక్కర్లేదు... మనకిప్పుడు పిల్లలద్దు. అబార్షన్ చేయిద్దాం"

రామకృష్ణ మాటతో నెత్తిన పిడుగులు పడ్డట్టు నివ్వెరపోయింది శ్వేత.

"అ...బా...ర్ష...నా...??"

మాటలు కూడదీసుకుంటూ నిశ్చేష్టురాలై అడిగింది.

"అవును. అబార్షనే. అది పుడితే నీ పదవికి గండం. మన కొంపకే అరిష్టం".

శ్వేత శిలాప్రతిమలా నిల్చుండిపోయింది.

అదేమిటి ? అదెలా ?? భయంగా కడుపు నిమురుకుంటూ అడిగింది.

"మనం ఇన్నాళ్లు గుర్తించలేదు. ప్రజానాయకులకు ఇద్దరు పిల్లలకు మించి వుండొద్దు. పంచాయత్‌రాజ్ చట్టం 1994 ఆర్టికల్ 19(3) ప్రకారం మూడో బిడ్డని కనగానే ఆదిలాబాద్ జిల్లా నెన్నెల మండలాధ్యక్షురాల్ని పదవినించి సస్పెండ్ చేశారు. అసలే ఇక్కడ నాకు ఎమ్మీవో గాడికి పడిచావట్లేదు. మూడోబిడ్డ పుడితే నీ పదవి పోతుంది. అందుకే అబార్షన్ అంటున్నాను...'' దృఢంగా చెప్పాడు రామకృష్ణ.

"నో..." భయంగా అరిచింది శ్వేత.

"రాజకీయం కోసం బిడ్డను చంపుకోవాలా నేను అలా ... చేయించుకోను. ఎట్టి పరిస్థితుల్లోనా చేయించుకోను" తెగేసి చెప్పింది.

"నీకు అరగబడటం బాగా అలవాటయ్యిందే.. పిచ్చిపిచ్చివేషాలు వేయ్యకు".

"కావాలనుకుంటే పిల్లల్ని తర్వాత కనొచ్చు... కాని పదవిని కాపాడుకోవటం ముఖ్యం" సీరియస్‌గా చెప్పాడు.

"పదవికన్న నాకు గర్భసంచి ముఖ్యం" కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నా దృఢంగా చెప్పింది.

"నీకింకా రాజకీయం తెలియలేదు... అస్నాబాద్ జడ్.పి.టి.సి. సభ్యురాలు రాజ్యలక్ష్మి నీకు తెల్సుగదా ప్రెగ్నెంట్ అని తెల్సినా ఇలాంటి పరిస్థితుల్లో అబార్షన్ చేయించుకుంది. అంతకన్నా పెద్ద పదవా నీది ?? సెస్నేల మండలాధ్యక్షురాలిలా నీ పదవీ పోతే చంపేస్తాను జాగర్త..." అంటూ పేపర్ మొహాన విసిరికొట్టి విసురుగా వెళ్లిపోయాడు.

శ్వేత పేపర్ తీసి వార్త చదివింది.

మళ్లీ ఏదో గుర్తొచ్చినట్టు వెంటనే ఫోన్ తీసుకొని ఓ నంబర్ డయల్ చేసింది.

"జడ్పిటిసి రాజ్యలక్ష్మి హియర్" అని విన్పించగానే "రాజ్యం...నేను శ్వేతని" అంది. గొంతులో ఆందోళన.

"శ్వేత...బావున్నావా ? ఏంటి విశేషాలు ?" అవతల్నించి రాజ్యలక్ష్మి.

"రాజ్యం...నువ్వు అబార్షన్ చేయించుకున్నావని... ?" శ్వేత మాట పూర్తికాకముందే.

"శ్వేతా... అదో పీడకల. ఇప్పుడిప్పుడే మర్చిపోతున్నాననుకో. నేను ఇండిపెండెంట్ సభ్యురాలినని తెల్సుకదా. జెడ్పీలో కాంగ్రెస్, తెలుగుదేశం సమాన మెజార్టీ రావటంతో తెలుగు దేశం చైర్మన్ అభ్యర్థికి నేను సపోర్టు చేయటంతో నా ఒక్క ఓటు మెజార్టీతోనే ఆయన చైర్మన్ అయ్యాడు నీకు తెల్సు... రాజకీయాల్లోకి రాకమునుపే నాకిద్దరు పిల్లలు. మళ్లీ నేను ప్రెగ్నెంట్ అయిన విషయం నాకంటెముందు ఎగస్పార్టీకి తెల్సింది. నేను బిడ్డను కనగానే నన్ను జడ్పీకి అనర్హురాలిగా ప్రకటించి తద్వారా చైర్మన్ పదవికి గండం తేవడానికి ప్రత్యర్థులు రంగం సిద్దం చేసుకుంటుండగానే... చైర్మన్ నించి మా ఆయనకు పిలుపొచ్చింది అబార్షన్ కోసం.

ఎంత దురదృష్టకరమైన పరిస్థితో చూసావా ... ?

ఏ పదవీ లేకపోయినా మా ఆయన దీన్ని రాజకీయంగా మలుచుకున్నారు. రెండు లక్షలకు బేరం కుదిరింది. మా ఆయన ఒత్తిడీ పెరిగింది. నేను తలవంచక తప్పలేదు. మన అమ్మతనం మీద నెత్తుటి పిండాలు అవిశ్వాసం ప్రకటిస్తే మాతృత్వపు ఉనికికూడా వుండదేమో!

కడుపులో పిండాలతో రాజకీయమాడుకునే మనల్ని ఏ బిడ్డా క్షమించదేమో శ్వేతా'' అంటూ రాజ్యలక్ష్మి దుఃఖంతో పూడుకుపోయినట్టు ఆగిపోయింది.

శ్వేత భారంగా శ్వాస విడిచింది.

అరనిమిషంపాటు మౌనం ఫోన్ తీగల్లో ప్రసరించిన తర్వాత అడిగింది రాజ్యలక్ష్మి.

"అవును శ్వేతా... నీ పరిస్థితీ నాలాగే అని తెల్సింది. నెన్నెల వార్త ఒక సంచలనమైంది. ఎమ్మీవోని బదిలీ చేయించాలని మీ ఆయన ప్రయత్నిస్తున్నట్టు తెల్సింది. దాంతో నువ్వు బిడ్డని కనగానే నిన్ను సస్పెండ్ చేసి వెళ్లడానికి ఎమ్మీవో కూడా ఏదో ప్రయత్నాలు చేస్తున్నాట్ట... మరేం నిర్ణయించుకున్నావ్... ?'' అంది.

"నేను పదవికన్నా...'అమ్మతనం' గొప్పదని భావిస్తున్నాను'' దృఢంగా చెప్పి ఫోన్ క్రెడిల్ చేసింది.

నుదుటిమీది చెమటని కొంగుతో అద్దుకుంటూ వెనక్కి తిరిగిన శ్వేత లేడిపిల్లలా వణికిపోయింది.

ఉగ్రుడై నిల్చున్న రామకృష్ణని చూసి !

'నీకు అమ్మతనం గొప్పదటే...' బలమైన పిడికిలి కడుపుని తాకింది... ఒళ్లంతా మెరుపులు పాకి 'అమ్మా' అన్న ఆర్తనాదం...

అరగంట తర్వాత ఆస్పత్రిలో...

కళ్లు మూసుకుని ముడుచుకు పడుకున్న పసిగుడ్డు కన్నుమూసింది కడుపులోనే! శ్వేతకు అబార్షన్ చేసారు.

అపురూపమైన సృష్టిలో అమ్మతనం గొప్పదన్నదెవడు... ? ?

నెత్తుటి పునాదుల మీద మగాడు సృష్టించిన అధికార పీఠం కంటె.... !!!

★ ★ ★